క్లుప్తంగా

నేడు 'గృహలక్ష్మి' మంజూరు పత్రాల పంపిణీ

పరకాల : నేడు (శుక్రవారం) పరకాల, నడికూడ పరిధిలోని ఎంపికైన గృహలక్ష్మి లబ్ధిదారులకు తన స్థానిక క్యాంపు కార్యాలయంలో మంజూరీ పత్రాలు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు అధికారులు, గ్రామ కార్యదర్శుల ద్వారా లబ్ధిదారులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులందరూ మధ్యాహ్నం 12 గంటల వరకు తన క్యాంపు కార్యాలయానికి హాజరై పత్రాలు పొందాలని కోరారు.

నేడు కలెక్టర్ రాక

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం గ్రామానికి నేడు (శుక్రవారం) జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ రానున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ప్రైమరీ స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

వార్షిక మహాసభ

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామీణ సహకార పరపతి సంఘం 67వ వార్షిక మహాసభ శుక్రవారం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సభ్యులు సకాలంలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి


రమాదేవి (ఫైల్)

దామెర : చికిత్స పొందుతున్న వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని ల్యాదెళ్ల గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ కథనం ప్రకారం.. ఇల్లంతకుంట మండలం లక్ష్మాజిపల్లికి చెందిన రమాదేవి (32)ను ల్యాదెళ్లకు చెందిన డెంగు అరుణ్‌కుమార్‌కు ఇచ్చి పదేళ్ల క్రితం వివాహం జరిపించారు. దంపతులకు ఇద్దరు కొడుకులు కలిగారు. తమకున్న నాలుగెకరాలతోపాటు మరో 3 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ దంపతులు జీవనం సాగిస్తున్న క్రమంలో ఈ ఏడాది పంట సాగు కోసం రూ.5 లక్షలు అప్పు అయ్యింది. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతినడంతో అప్పులు ఎలా తీర్చాలనే వేదనతో రమాదేవి ఈనెల 8న ఇంట్లోనే గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను తొలుత వరంగల్‌లోని ఎంజీఎంకు, అనంతరం అక్కడి నుంచి మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా రమాదేవి పరిస్థితి విషమించి మృతి చెందింది. రమాదేవి తండ్రి చెలిక క్రిష్టారావు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై చెప్పారు.

అన్నదానం



గీసుకొండ : మండల కేంద్రంలోని ఎల్లమ్మ దేవాలయంలో వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో గురువారం అన్నదానం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కోల కుమారస్వామి అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమంలో సీఐ రామకృష్ణ పాల్గొని భక్తులకు వడ్డించారు.

స్వచ్ఛతపై ముగ్గుల పోటీలు



గీసుకొండ : మండలంలోని మరియపురంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తడి, పొడి చెత్త సేకరణ, వేరు చేయడం, వర్మీ కంపోస్టు తయారీ తదితర విషయాలపై గురువారం సర్పంచ్ అల్లం బాలిరెడ్డి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ అంశంపై ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఉన్నతి కార్యక్రమం ద్వారా కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి నల్లెల్ల స్వప్న, సెర్ప్ సీసీ సుజాత పాల్గొన్నారు.

దేవన్నకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఎకనామిక్స్ విభాగంలో పరిశోధకుడు సిల్వర్ దేవన్నకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. సోషియో ఎకనామిక్స్ అండ్ హెల్త్ డెవలప్‌మెంట్ ఆఫ్ ప్రిమిటివ్ ట్రైబ్స్ ఏ స్టడీ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సిల్వర్ దేవన్నకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ సురేష్‌లాల్ పర్యవేక్షణలో దేవన్న తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

కొండా లక్ష్మణ్ సేవలు మరువలేనివి


పరకాల : కొండా లక్ష్మణ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విజయ్‌చందర్‌రెడ్డి, నాయకులు

పరకాల : తెలంగాణ రాష్ట్ర సాధనలో కొండా లక్ష్మణ్ బాపూజీ అందించిన సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి తెలిపారు. కొండా లక్ష్మణ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి విజయ్‌చందర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడారు. కొండా లక్ష్మణ్ తెలంగాణ కోసం క్రియాశీలకంగా ఉద్యమించారని చెప్పారు. ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి, రాష్ట్ర నాయకుడు దేవునూరి మేఘనాథ్, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, మండల అధ్యక్షుడు పుట్ట రవీందర్, పట్టణ నాయకులు దంచనాల సత్యనారాయణ, ఆకుల రాంబాబు, పాలకుర్తి తిరుపతి, కానుగుల గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు : నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు : పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు వెల్దె వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షులు పాపని రవీందర్, చిమ్మని దేవరాజు, బలభద్ర కిషోర్, ప్రధాన కార్యదర్శి న్యాతని ప్రవీణ్, కోశాధికారి వడ్డెపెల్లి ప్రసాద్, వేణు, శ్రవణ్‌కుమార్, అలువాల రవి, కపిల్, కోటయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.


శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో, చౌరస్తాలో ఆచార్య కొండా లక్ష్మణ్ చిత్రపటానికి చేనేత సహకార సంఘం పీఏసీ చైర్మన్ మామిడి శంకర్‌లింగం, పద్మశాలీ సంఘం నాయకులు వంగరి సాంబయ్య పూలమాలలు, నూలు దండలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం పీఏసీ సభ్యులు బూర లక్ష్మీనారాయణ, రంగు ఆనందం, దాసరి సమ్మయ్య, దిడ్డి ప్రభాకర్, నాయకులు చిందం రవి, బాసాని ప్రకాష్, బాసాని సదాశివుడు, ఆడెపు అశోక్, బూర కుమారస్వామి పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న స్ఫూర్తి కొనసాగిస్తాం


మాట్లాడుతున్న రవికృష్ణ గౌడ్

పరకాల : సర్వాయి పాపన్న స్ఫూర్తిని కొనసాగిస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో సర్వాయి పాపన్న విగ్రహ ప్రతిష్ఠ కోసం తలపెట్టిన పనులకు స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణతో కలిసి రవికృష్ణ గురువారం భూమి పూజ చేశారు. అనంతరం రవికృష్ణ మాట్లాడారు. సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను బీసీలు అధ్యయనం చేయాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత రామకృష్ణ మాట్లాడుతూ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు అభినందనీయమని చెప్పారు. విగ్రహాన్ని ఉచితంగా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్ ఆముదాలపల్లి మల్లేశం, గోపా జిల్లా అధ్యక్షుడు బోనగిరి యాదగిరి, పట్టణ అధ్యక్షుడు డాక్టర్ రజనీకాంత్, కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిర్ర రాజు, విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు బండి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర' నిర్ణయంతో ఎల్ఐసీ ఏజెంట్లకు లబ్ధి

శాయంపేట : గ్రాట్యూటీ, టర్మ్ ఇన్సూరెన్స్ పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో దేశంలోని 13 లక్షల మంది ఎల్ఐసీ ఏజెంట్లకు లబ్ధి చేకూరుతుందని ఎల్ఐసీ ఏజెంట్స్ సంఘ్ (బీఎల్ఐఏఎస్) గౌరవ అధ్యక్షుడు పిన్నింటి సంపత్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఐసీ ఏజెంట్ల గ్రాట్యూటీని రూ.5 లక్షలకు, టర్మ్ ఇన్సూరెన్స్ కవరేజీని రూ.25 వేల నుంచి 15 లక్షలకు పెంచడానికి కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిందని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది అధిక వర్షాలతో వ్యాపారం తగ్గిన నేపథ్యంలో ఏజెంట్లకు ఫ్లడ్ అడ్వాన్స్ ఇవ్వాలని, పాలసీదారుల ప్రీమియం, పాలసీల లోపుపై వడ్డీలను తగ్గించాలని, పాలసీదారులకు, ఏజెంట్లకు నష్టం కలిగించే మార్పులను తొలగించాలని కోరారు.

చైర్మన్ పదవి యాదవులకే ఇవ్వండి


సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

హన్మకొండ చౌరస్తా : ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పదవిని యాదవ కులానికి చెందిన నాయకుడికే ఇవ్వాలని అఖిల భారత యాదవ మహాసభ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య డిమాండ్ చేశారు. హనుమకొండ కాకాజీకాలనీలో గురువారం నిర్వహించిన యాదవ మహాసభ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో సుమారు 40 వేల మంది యాదవులు ఉన్నారని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం ఆలయ కమిటీ చైర్మన్ పదవిని తమ కులానికే కేటాయించాల్సి ఉందన్నారు. సమావేశంలో మహాసభ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నక్క కొంరెల్లి, జిల్లా సహాయ కార్యదర్శి బైరబోయిన కోటేశ్వర్, అధికార ప్రతినిధి దేనబోయిన రవి, గొర్ల కాపర్ల సొసైటీ వైస్ చైర్మన్ కావటి సారయ్య, రాజారపు రాజు, నల్లబెట్టు చిన్నరాజు, ప్రధాన కార్యదర్శి జన్ను లవన్‌యాదవ్, జక్కుల రాజు, జక్కుల శివ, గాజు రాజు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ



నడికూడ : మండలంలోని ముస్త్యాలపల్లిలో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ తీసుకున్న మహిళలకు సర్పంచ్ బొట్ల సంధ్య రవి, బీఆర్ఎస్ పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు నందికొండ జయపాల్‌రెడ్డి గురువారం కుట్టు మిషన్లు, చీరలు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ సంధ్య, సమన్వయ కమిటీ సభ్యుడు జయపాల్‌రెడ్డి మాట్లాడారు. మహిళలు కుట్టు శిక్షణ ద్వారా స్వయం ఉపాధి పొందాలని సూచించారు. మహిళలతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రఘునాచారి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ యాకయ్య

సంగెం : ఎరువులు, పురుగు మందుల డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి చాట్ల యాకయ్య కోరారు. ఈ-పాస్ మిషన్‌లో స్టాకు, షాపులో ఉన్న ఎరువుల నిల్వలు సమానంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల పరిధిలోని ఎరువులు, పురుగుల మందుల డీలర్లు, డీసీఎంఎస్, ఆగ్రోస్, సొసైటీ సీఈఓలతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక ధరలకు విక్రయించినా, నకిలీ ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులతో స్నేహపూరిత వాతావరణంలో నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులు విక్రయించాలన్నారు. షాపుల్లోని ఎరువుల నిల్వలను రోజువారిగా వ్యవసాయశాఖాధికారులకు తెలియజేయాలన్నారు. అడిగిన వెంటనే అవసరమైన రిపోర్టులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీలర్ల అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు గజ్జెల శ్రీనివాస్, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పొన్నర్సు బ్రహ్మయ్య, ఇటుకాల సురేష్, డీలర్లు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ గొర్రెకుంట కట్టమల్లన్న చెరువును గురువారం ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ పరిశీలించారు. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు మండలంలోని ఆయా గ్రామాల నుంచి వినాయక విగ్రహాలను ప్రతీ ఏటా కట్టమల్లన్న చెరువులో నిమజ్జనం చేస్తున్నారు. జాగ్రత్తలు, నిమజ్జన ఏర్పాట్లపై మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, గీసుకొండ సీఐ రామకృష్ణతో డీసీపీ చెరువు వద్ద సమీక్షించారు.

రక్తదాన ఆవశ్యకతపై ప్రచారం అవసరం


రక్తదాతలకు సర్టిఫికెట్ అందిస్తున్న గోపాల్‌రావు

హన్మకొండ: రక్తదాన ఆవశ్యకతపై విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ అతిథి గృహంలో టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్, వివిధ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో గురువారం నిర్వహించిన విద్యుత్ ఉద్యోగుల మెగా రక్తదాన శిబిరాన్ని గోపాల్ రావు ప్రారంభించారు. ఈ సదర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న ప్రతీఒక్కరు రక్తదానం చేయొచ్చని వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటేశ్వర రావు, గణపతి, సంధ్యారాణి, మోహన్ రెడ్డి, తిరుపతిరెడ్డి, సీజీఎంలు సదర్‌లాల్, మధుసూదన్, మోహన్ రావు, కిషన్, కేఎన్.గుట్ట, ఎస్ఈలు వెంకటరమణ, వేణుమాధవ్, మధుసూదన్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల దీక్షలు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కేయూ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో పరిపాలన భవనం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 18వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల శిబిరంలో కుక్కా జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోధ్, కాంట్రాక్టు అధ్యాపకులు నివాస్, డాక్టర్ లక్ష్మారెడ్డి, డాక్టర్ మధుకర్‌రావు తదితరులు కూర్చున్నారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి

విద్యారణ్యపురి: విద్యార్థులు డిజిటల్ కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంచుకోవాలని కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి కోరారు. కళాశాలలో డిజిటల్ మెంటరింగ్‌పై గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కృత్రిమ మేధతో మనిషి జీవితం సాంకేతికమయమై పోయిందని చెప్పారు. సైబర్ ప్రపంచంలో కొత్త ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. టాస్క్ ప్రత్యేక శిక్షకురాలు శ్వేత మాట్లాడుతూ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సాయంతో సాంకేతిక నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. కేడీసీ మహిళా సాధికారిత విభాగం కన్వీనర్ ఇందిరాదేవి, టీఎస్‌కేసీ సమన్వయ కర్త లింగారెడ్డి, ఫుల్‌టైం మెంటార్ సాగర్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

కేయూ క్యాంపస్: మెస్ బకాయిలు చెల్లించకున్నా విద్యార్థుల మెస్ కార్డులను రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కేయూ పరిపాలన భవనం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మిశ్రీన్ సుల్తానా, మంద శ్రీకాంత్ మాట్లాడారు. పూర్తి మెస్ బకాయిలు చెల్లిస్తేనే మెస్ కార్డులు జారీ చేస్తామని యూనివర్సిటీ అధికారులు ఆదేశాలు జారీ చేయటం సరికాదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, బాధ్యులు వరుణ్, సందీప్, రాజ్‌కుమార్, ప్రవళిక, అనూష తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

హన్మకొండ: పెండింగ్‌లో ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ డేగ సమ్మయ్య కోరారు. ఈమేరకు హనుమకొండలోని టీఎస్ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ గోపాల్‌రావును డేగ సమ్మయ్యతో పాటు ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు పాండు, ప్రధాన కార్యదర్శి వంగ రవీందర్ గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఇంజనీర్ల సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అంతకుముందు తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ టీఎస్ఎన్పీడీసీఎల్ శాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 15 జిల్లాల నుంచి అసోసియేషన్ సభ్యులు తరలివచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శంకరయ్య, సుధాకర్, వెంకటరమణ, రామ్‌నితిన్, రాము, బాలాజీ, తరుణ్, వెంకటేష్, రాములు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతోనే చేరికలు

- జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేష్


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ఐనవోలు : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనతోనే బీఆర్ఎస్‌లో ఇతర పార్టీల నుంచి పలువురు చేరుతున్నారని ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. మండలంలోని నందనం గ్రామానికి చెందిన 70 మంది ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాయలంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు గ్రామ స్థాయి నుంచి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. ఈ క్రమంలోనే ఇతర పార్టీల శ్రేణులు సైతం బీఆర్ఎస్‌లో చేరేందుకు వస్తున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలకు డిపాజిట్లు కూడా దక్కకుండా చూడాలన్నారు. పార్టీలో చేరిన వారిలో యాకర నర్సింహులు, యాకర లక్ష్మణ్, యాకర చంద్రయ్య, నర్సి ఎల్లయ్య, బర్ల జనార్ధన్, ఏలియా, రవి, భాస్కర్ ఉండగా కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఎంపీపీ మార్నేని మధుమతి, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్ అలీ, పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బుర్ర రాజశేఖర్, అధికార ప్రతినిధి మిద్దెపాక రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై మోసపూరిత వైఖరి


ధర్మసాగర్ : రాస్తారోకో చేస్తున్న నాయకులు


ఆత్మకూరు: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న శ్రేణులు

ధర్మసాగర్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ పట్ల మోసపూరిత వైఖరి అవలంబిస్తోందని ఎంఎస్పీ జాతీయ నాయకుడు వేల్పుల సూరన్న విమర్శించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని కరుణాపురం జాతీయ రహదారిపై గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సూరన్న మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదిస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకుని గద్దెనెక్కి తదనంతరం కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ నాయకత్వంలో 29 ఏళ్లుగా పోరాడుతుండగా బీజేపీ హామీ ఇచ్చి విస్మరించిందని ధ్వజమెత్తారు. ప్రస్తుత పార్లమెంటరీ సమావేశాల్లోనైనా ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన రీతిలో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జన్ను దినేష్, గంగారపు శ్రీనివాస్, గద్దల సుకుమార్, చాతల్ల శివ, మాట్ల వెంకటస్వామి, రేణుకుంట్ల భిక్షపతి, రేణుకుంట్ల మహేష్, పాడిశెట్టి ప్రతాప్, సోంపెల్లి అన్వేష్, చిలుక రాజు, చిట్యాల బాలస్వామి, మంద వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో మండలంలోని గూడెప్పాడ్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంటరీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ జిల్లెల మురళి, ఎంఎస్పీ జిల్లా నాయకులు బండారి సురేందర్, ఎంఎస్ఎఫ్ నాయకులు ముక్కెర ముఖేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు గోవిందు రవికుమార్, పాల్, జైపాల్, కిరణ్, పరికి నవీన్, చింతం హరీష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై నిర్లక్ష్యం సరికాదు

- బీజేపీ రాష్ట్ర నాయకుడు సురేందర్‌రెడ్డి


సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

ఎల్కతుర్తి : అంగన్‌వాడీ కార్యకర్తల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని బీజేపీ రాష్ట్ర నాయకుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. భీమదేవరపల్లి మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టి 11 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం తగదన్నారు. పల్లెల్లో అంగన్‌వాడీల సేవలు మరువలేనివని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు వారికి రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ విరమణ సందర్భంగా రూ.10 లక్షలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తొలుత అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పృథ్వీరాజ్‌గౌడ్, నాయకులు సంపత్, శ్రీనివాస్, వేణు, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

కాబోయే ఎమ్మెల్యే కాపు బిడ్డే


ఐక్యత చాటుతున్న మున్నూరు కాపు కులస్తులు

- మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి

సంగెం : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి కాబోయే ఎమ్మెల్యే బీసీ మున్నూరు కాపు బిడ్డే అని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి జోస్యం చెప్పారు. గురువారం మండలంలోని ఆశాలపల్లిలో మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 25 శాతం ఉన్న మున్నూరుకాపు కులస్తుందరు ఏకతాటిపైకి వచ్చి కులానికి చెందిన వ్యక్తిని గెలిపించుకోవాలన్నారు. ఒక్కొక్కరు 10 మందికి చెప్పి ఓట్లు వేయిస్తే 50వేల భారీ మెజారిటీతో కాపు బిడ్డ ఎమ్మెల్యేగా గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు కూడా మద్దతు పలుకుతున్నాయన్నారు. సమావేశానికి రాకుండా ఎమ్మెల్యే ధర్మారెడ్డి ఆపుతున్నారని కులంలో విబేధాలు సృష్టిస్తూ దూరం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఏ పార్టీలో ఉన్నా కులస్తుందరూ ఒకటేనని చెప్పారు. కులస్తుడిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సేవకుడిగా పనిచేస్తా..

పరకాల నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా పని చేస్తానని డాక్టర్ కాళీప్రసాదరావు తెలిపారు. ఒక అవకాశం ఇస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల అభ్యున్నతికి పాటుపడతానని చెప్పారు. భవిష్యత్ మార్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మంద ఐలయ్య, మేడిపల్లి శోభన్ బాబు, గోదాసి చిన్న, ఎరుకల దివాకర్, తదితరులు పాల్గొన్నారు.